
సాక్షి
బాపట్ల
బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళ వారం 2423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.0997 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4200క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2000 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళ వారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటీ కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభ వించలేదు.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై ప్రిన్సిపాల్స్‌తో నేడు సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: మార్చిలో జరగనున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లపై బుధ వారం జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్ఐఓ జి.సు నీత మంగళవారం తెలిపారు. ఉమ్మడి గుం టూరు జిల్లా పరిధిలో రెండేళ్ల ఇంటర్మీడియెట్ కోర్సులు నిర్వహిస్తున్న అన్ని యాజమాన్యాల్లోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ బుధవారం ఉదయం 10 గంట లకు గుంటూరులోని ఏసీ కళాశాల ఆడిటోరి యంలో నిర్వహిస్తున్న సమావేశానికి విధిగా హాజరు కావాలని సూచించారు. పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లు, ప్రాక్టికల్స్ నిర్వహణ, పరీక్షా కేం ద్రాల ఏర్పాటు వంటి అంశాలపై చర్చిస్తామని తెలిపారు.

108 అంబులెన్స్‌లో తనిఖీలు



గుంటూరు మెడికల్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ నాగళ్ల జయరామకృష్ణ మంగళవారం 108 అంబులె న్సులను మంగళగిరిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్సుల్లో వైద్య పరికరాలు ఏవిధంగా ఉన్నాయి, వాటిల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను పరిశీ లించారు. కొద్దిపాటి లోపాలను గుర్తించి తక్ష ణమే సరిదిద్దుకోవాలని ఆదేశించారు. తని ఖీల్లో డాక్టర్ జయరామకృష్ణతోపాటు, డాక్టర్ గురుప్రసాద్ పాల్గొన్నారు.

నేడు సాగర్‌ప్రాజెక్టుకు కేఆర్ఎంబీ కమిటీ



విజయపురిసౌత్: కృష్ణానది యాజమాన్య బోర్డు జలాశయాల పర్యవేక్షణ కమిటీ బుధ వారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శిం చనున్నారు. కుడి, ఎడమ కాల్వలతో పాటు, ప్రధానడ్యాం, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులోని కాల్వ లను సందర్శించనున్నారు. మంగళవారం విజయపురిసౌత్‌లోని లాంచీస్టేషన్ నుంచి నాగార్జునకొండకు వెళ్ళి అక్కడి మ్యూజి యాన్ని సందర్శించారు. అనంతరం బుద్ధవ నాన్ని సందర్శించారు. కొండను సందర్శించిన వారిలో కృష్ణారివర్ మేనేజ్మెంట్‌బోర్డు కమిటీ సభ్యులు ఏ అజయ్‌కుమార్‌గుప్తా, ఎస్ఈ అశో క్‌కుమార్, ఈఈలు శివప్రసాద్, రాఘవేంద్ర రావులు ఉండగా వీరివెంట సాగర్ డ్యాం ఈఈ మల్లిఖార్జున్‌రావు, డీఈలు మురళీధర్, సుదర్శ న్,శ్రీనివాస్,ఏఈ కృష్ణయ్య, కోటేశ్వరావు, తది తరులు ఉన్నారు.వీరికి టూరిజం గైడ్ సత్యనా రాయణ బుద్ధవనం గురించి వివరించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 562.50 అడుగుల వద్ద ఉంది. ఇది 238.2440 టీఎంసీలకు సమా నంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 10,120, ఎడమకాలువకు 8,718, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 12,239, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీం తో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 33,797 క్యూసెక్కుల నీరు విడుదలవు తోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,130 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 837.00 అడుగుల వద్ద ఉంది. ఇది 57.5860 టీఎంసీలకు సమానం.

యార్డుకు 1,28,100 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,28,100 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,24,651 బస్తాలు అమ్మ కాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.24,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయా నికి యార్డులో ఇంకా 82,219 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఆట.. గెలుపు బాట

విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయి. ఆటలు ఆడడం ద్వారా శారీరక సౌష్టవం, చదువు.. చేసే పనిపై ఏకాగ్రత సైతం ఏర్పడుతుంది. నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుం ది.. నూతన స్టేడియాలు, ఇండోర్ స్టేడియాలు నిర్మాణంలో ఉండగా.. నూతన కోచ్‌ల ఆధ్వర్యంలో వివిధ క్రీడలకు సంబంధించిన శిక్షణ శిబిరాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ప్రతిభ నిరూపించు కున్న జిల్లా క్రీడాకారులు త్వరలో జరగనున్న ప్రతిష్టాత్మక పోటీలకు సిద్ధమవుతున్నారు..

- క్రీడలకు సర్కార్ దన్ను
- శాప్ ఆధ్వర్యంలో జిల్లాలో క్రీడల అభివృద్ధి
- క్షేత్రస్థాయిలో క్రీడాకారుల గుర్తింపు
- పలు క్రీడల్లో ప్రతిభ చూపుతున్న క్రీడాకారులు
- సీఎం కప్ పోటీలకు సిద్ధమవుతున్న జిల్లా స్పోర్ట్స్ విభాగం



విద్యార్థులకు కబడ్డీలో శిక్షణ ఇస్తున్న కోచ్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ఇం దుకోసం శాప్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున క్రీడాపో టీలు నిర్వహిస్తుంది. ఆటల్లో ప్రతిభ చూపిన క్రీడా కారులను బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తుంది. వారిలోని ప్రతిభను వెలికితీసి ఉన్నతస్థాయికి చేరు కునేలా చేయూతనిస్తుంది. క్రీడల ద్వారా యువత శారీరక దారుఢ్యంతోపాటు మానసిక వికాసం పెం పొందేలా చూస్తోంది.

జిల్లాలో క్రీడల అభివృద్ధి..

జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ప్రధానంగా శాప్ ఆధ్వర్యంలో జిల్లాలో వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, బ్యాట్మింటన్, బాల్ బ్యాట్మింటన్, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్ , హ్యాండ్ బాల్, హాకీ, ఖోఖో, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, టెన్నికాయిట్, వెయిట్ లిఫ్టింగ్‌తో కలిపి 14 క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. మండలస్థా యిలో విద్యార్థుల ప్రతిభను గుర్తించి జిల్లాస్థాయిలో వారికి ఆసక్తి ఉన్న ఆటలపై శిక్షణ ఇస్తున్నారు.

కోచ్‌ల నియామకం...

వాలీబాల్, కబడ్డీ, షటిల్ తదితర ఆటలకు సం బంధించి జిల్లా కేంద్రంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ముగ్గురు కోచ్‌లను నియమించింది. వారి ద్వారా బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో వందమంది స్టూడెంట్స్‌కు వివిధ విభాగాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

బాపట్లకు రాష్ట్రస్థాయి బహుమతులు...

ఇటీవల విజయవాడలో ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ స్పోర్ట్స్‌డే పోటీల్లో బాపట్ల జిల్లా వాలీ బాల్ జట్టు ప్రథమ బహుమతి సాధించింది. అనంతరం జరిగిన జగనన్న క్రీడా సంబరాల్లోనూ బాపట్ల కబడ్డీ జట్టు రాష్ట్రస్థాయిలో మొదటి బహు మతి, వాలీబాల్ పురుషుల విభాగంలో రెండవ బహుమతి, మహిళల విభాగంలో మూడవ బహుమతి గెలుచుకొని బాపట్ల ఖ్యాతిని రాష్ట్రస్థా యిలో ఇనుమడింపచేశారు.

క్రీడాభివృద్ధికి ఇండోర్ స్టేడియాలు..

జిల్లాలోని బాపట్ల, పర్చూరు, పందిళ్లపల్లి ప్రాం తాల్లో ఇండోర్ స్టేడియాల పెండింగ్ పనులనుపూర్తి చేసి త్వరలో ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే బాపట్లలో ఇం డోర్ స్టేడియం ప్రారంభమైంది. మిగిలినవి ప్రారంభం అయితే క్రీడాభివృద్ధి వేగవంతం అవుతుంది.

క్రీడాభివృద్ధికి వేగంగా చర్యలు



జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటుంది. క్రమం తప్పకుండా వివిధ స్థాయిల్లో ఆటలు పోటీలు నిర్వహిస్తున్నాం. బాపట్ల జిల్లా జట్లు రాష్ట్రస్థా యిలో బహుమతులు పొందాయి. తిరుప తిలో జరిగే సీఎం కప్ పోటీలకు జిల్లా జట్లు శిక్షణ పొందుతున్నాయి.

– పాల్ కుమార్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి

సీఎం కప్ సాధనే లక్ష్యం..

ఫిబ్రవరి 22 నుంచి 26 తేదీవరకు తిరుపతిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ సాధనే లక్ష్యంగా బాపట్ల జట్లు సన్నద్ధం అవుతు న్నాయి. ఇందుకోసం ప్రధానంగా వాలీబాల్, కబడ్డీ జట్టుతోపాటు మిగిలిన విభాగాల్లోని క్రీడాకారులు కఠోర సాధన చేస్తున్నారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా జట్లు ప్రధాన పోటీలో తలబడి ఆయా విభాగాల్లో మొదటి బహుమ తులు గెలుచుకొనే అవకాశం ఉందని జిల్లా స్పోర్ట్స్ అధికారి పాల్ కుమార్, వాలీబాల్ కోచ్ రాధాకృష్ణలు తెలిపారు.

ఎస్సీ కాలనీల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకూడదు

అధికారులకు మంత్రి మేరుగ నాగార్జున సూచన



కూచిపూడి(వేమూరు): ఎస్సీ సబ్‌ప్లాన్ నిధు లతో నియోజకవర్గంలోని ఎస్సీ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం జరుగు తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి ఇరిగేషన్ గెస్ట్‌హౌ స్‌లో విద్యుత్ శాఖ, ఎండోమెంట్ అధికారు లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వ హించారు. వేమూరులో 135 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎస్సీ కాలనీల్లో విద్యుత్ సమస్యలు ఉండకుం డా చూడాలన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు లేకుండా ఆరు కొత్త విద్యుత్ సబ్ స్టేషన్‌లు జంపని, వెల్లటూరు, ఓలేరు, ఇం టూరు, మోదుకూరు, చినగాదెలవర్రులలో ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో కరెంట్ స్తంభాల కొరత ఉండకూదని ఆయన అధికారులకు సూచించారు. ఈ నెల 18న మహాశివరాత్రి తిరునాళ్ల ఘనంగా నిర్వహిం చేందుకు ట్రస్ట్ బోర్డు కమిటీలు ఏర్పాటు చేయాలని ఎండోమెంట్ అధికారులను ఆదేశిం చారు. మండలంలో గోవాడ తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండోమెంట్ కమి షనర్ ఎం.పానకాలరావు, విద్యుత్‌శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టరు కుమార్ బాబు, అశోక్ రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

ఎన్నిసార్లు చెప్పినా మారరా..?

- రెవెన్యూ అధికారులపై జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆగ్రహం
- సమగ్ర సమాచారంతో రాకుంటే తీవ్ర చర్యలకు వెనకాడబోమంటూ హెచ్చరికలు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: రెవెన్యూ అధికారులపై జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర సమాచారం, నివేదికలు లేకుండా అధికారులు సమావేశాలకు ఏలా హాజరవుతారని, ఎన్నిసార్లు చెప్పించుకుంటారని మం డిపడ్డారు. రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారు లతో స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గనులకు సంబం ధించిన భూములకు ఎన్‌ఓసీలు ఇచ్చే సమయంలో ప్రభుత్వ ఉత్తర్వులు అధ్యయనం చేయాలని కలెక్టర్ చెప్పారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వ ఉత్తర్వుల ఆధా రంగా భూములకు ఎన్‌ఓసీలు మంజూరు చేశారో తెలపాలని బాపట్ల, కర్లపాలెం తహసీల్దార్లను అడగగా సరైన సమాధానం చెప్పకపోవడంతో కలెక్టర్ మండి పడ్డారు. ఎన్‌ఓసీ జారీ చేసే అధికారాలు, వాటి మార్గ దర్శకాలు తెలుసుకోవాలని హెచ్చరించారు. స్పష్టమైన వివరాలు కూడా చెప్పలేకపోవడంతో కలెక్టర్ అస హనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు స్పష్టంగా తెలియకుండా విధులు ఎలా నిర్వర్తిస్తారంటూ నిలదీ శారు. జిల్లాలో స్పందన అర్జీలను గడువులోగా పరి ష్కరించాలన్నారు. పునరావృతమయ్యే కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 90 రోజుల్లో నివేశన స్థలాల కేటాయింపు, లబ్ధిదారులకు పంపిణీ చేయడా నికి గుర్తించిన భూమి, లేఅవుట్ల ఏర్పాట్లపై తహసీల్దా ర్లను అడగగా సమాధానం చెప్పలేకపోవడంతో ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆ భూమిలో ఇంకా ఎన్ని ఖాళీలు ఉన్నాయో అధికారులు స్పష్టమైన నివే దిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో అధి కారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని ఘాటుగా హెచ్చరించారు. ఈ సమావేశంలో జేసీ డా.కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు బి.రవీందర్, సరోజిని, పార్థసారథి, కలెక్టరేట్ పరిపా లన అధికారి పార్వతి, చీరాల, సంతమాగులూరు, అద్దంకి తహసీల్దార్‌లు ప్రభాకర్, అశోక్ వర్ధన్, సుబ్బా రెడ్డి పాల్గొన్నారు.

డబ్లింగ్ పనులు వేగవంతం

డీఆర్ఎం రామకృష్ణ



శావల్యాపురం రైల్వే స్టేషనులో అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఎం రామకృష్ణ

శావల్యాపురం: గుంటూరు నుంచి గుంతకల్ రైల్వే డబ్లింగ్ పనులు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టినట్లు గుంటూరు రైల్వే డివిజన్ రీజ నల్ మేనేజరు (డీఆర్ఎం) ఎం.రామకృష్ణ పేర్కొ న్నారు. మంగళవారం శావల్యాపురం రైల్వే స్టేషను సందర్శించి డబ్లింగ్ పనులను పరిశీలించారు. డీఆర్ ఎం మాట్లాడుతూ నరసరావుపేట పరిధిలో మున మాక నుంచి శావల్యాపురం రైల్వేస్టేషను వరకు 22 కిలోమీటర్ల మేర పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. గుంటూరు నుంచి నంద్యాల వరకు 260 కిలోమీటర్ల ఉండగా ప్రస్తుతం రెండవ ట్రాక్ పనులు 120 కిలోమీటర్ల పూర్తి అయినట్లు చెప్పారు. నడికూడి–శ్రీకాళహస్తి రైల్వే పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 600 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. అలాగే నడి కూడి – శ్రీకాళహస్తి పనుల్లో భాగంగా గుండ్లకమ్మ నుంచి దర్శి వరకు 25 కిలోమీటర్ల వరకు పనులు 2024 మార్చి నెలలో పూర్తి చేస్తామని, అలాగే దర్శి నుంచి కనిగిరి వరకు 55 కిలోమీటర్ల వరకు 2025 మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు. శావల్యాపురం లో రైల్వేగేటు 268 నంబరు సమీపంలో ఆర్‌యూబీ పనులకు కలెక్టరు నుంచి అనుమతులు వచ్చాయని ఆరు నెలల వ్యవధిలో పనులు పూర్తి చేస్తామన్నారు.

నాడు పథకాల్లో కోతలు.. నేడు మాటల్లో కోతలు

- టీడీపీని నమ్మేస్థితిలో ప్రజలు లేరు
- రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



వంకాయలపాడులో సచివాలయ భవనం ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ప్రభుత్వం కొత్త ఒరవడి సృష్టిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మంగళ వారం యడ్లపాడు మండలం వంకాయలపాడులోని ఉపాధిహామీ పథకం నిధులు రూ.40 లక్షలతో నిర్మిం చిన గ్రామ సచివాలయాన్ని మంత్రి ప్రారంభించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు స్థానికంగా అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సమస్య లపై సచివాలయాన్ని సందర్శిస్తే సత్వరమే వారి సమస్య పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. వంకాయలపాడు సచివా లయం నుంచి తమ ప్రభుత్వ హయాంలో 4వేలకు పైగా ప్రభుత్వ సేవలు అందించనట్లు వెల్లడించారు. పంచాయతీలోని 5,583 మందికి 20 పథకాలకు చెం దిన రూ.15.50 కోట్ల లబ్ధి పొందారన్నారు. గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల సంఖ్యను ఎలా తగ్గించుకోవాలనే ఆలోచన చేస్తే ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం అర్హులైన లబ్ధిదారులెవ్వరికీ అన్యాయం జరగకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తుందన్నారు. ప్రతి కుటుంబానికి ఏదో విధంగా లబ్ధి చేకూర్చి వారు ఆర్థిక అభ్యున్నతిని సాధించే దిశగా ఆయా పథకాలు అమలవుతున్నాయన్నారు. టీడీపీ నాయకులు చెప్పే మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని, 14 ఏళ్లు సీఎం పద విలో ఉన్న చంద్రబాబునాయుడు ఆందోళన చూస్తుం టే టీడీపీకి ఇక నూకలు చెల్లినట్లేనన్న సంకేతాలు వెలువడుతున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారని, గడపగడప కార్య క్రమంలో పర్యటిస్తున్న సందర్భంలో లబ్ధిదారులు ప్రజాప్రతినిధుల్ని ఆప్యాయంగా స్వాగతించడం, మద్దతు ప్రకటించడం ఇందుకు నిదర్శనాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందిం చి, ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వినూత్న పథ కాలు అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూర్చు తున్నాయని తెలిపారు. ప్రజా సంక్షేమంపై సీఎం జగ న్‌కు ఉన్న చిత్తశుద్ధి ఏ రాజకీయ నాయకుడికి లేద న్నారు. చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్ ఎం.వీరా రెడ్డి, ఎంపీపీ, వైఎస్ ఎంపీపీలు పి.ఝాన్సీ, షేక్ నాజులా, సర్పంచి వడ్డేపల్లి నరసింహారావు, ఘంటా శంకర్, ఆర్.చింతారావు, బి.శివరామకృష్ణ, వి.శ్రీను బాబు, శ్రీనివాసనాయక్, బొల్లయ్య, ఒ.పూర్ణయ్య, ఖాదర్‌బాష, సయ్యద్‌మస్తాన్‌వలి, షేక్ అల్లాబక్షు(బు జ్జి), సుభాని, రవి, మంగయ్య, అంకారావు ప్రజాప్ర తినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం

- అరుదైన గౌరవం కల్పించినందుకు నాయీ బ్రాహ్మణుల కృతజ్ఞతలు
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణ నాయకులు

చీరాల అర్బన్: బీసీలను బ్యాక్ వార్డ్ క్లాసులుగా కాకుం డా బ్యాక్ బోన్ క్యాస్ట్‌లుగా మార్చి చూపిస్తాననే మాట లను నిజం చేసి చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహ న్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని నాయీ బ్రాహ్మణులు పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణులకు దేవస్థానాల్లో బోర్డు సభ్యులుగా అవకాశం కల్పించినం దుకు మంగళవారం స్థానిక గడియార స్థంభం సెంట ర్‌లోని సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి చీరాల, పేరాల నాయీబ్రాహ్మణ సేవా సంఘ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, తాడివలస దేవరాజులు మాట్లాడారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని ఆలయ కమిటీలల్లో పాలకమండలి సభ్యులుగా ఒక నాయీ బ్రాహ్మణుడు ఉండాలని గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేయడం చారిత్రక విషయమన్నారు. టీటీడీ దేవస్థా నంతో పాటు దేవదాయశాఖ పరిధిలోని 610 దేవాల యాల పాలకమండలిలో నాయీ బ్రాహ్మణులు ఉండ టం గొప్ప గౌరవమన్నారు. అలానే నాయీ బ్రాహ్మణు లకు ఎమ్మెల్సీగా అవకాశాన్ని కల్పించాలని కోరారు. ఆర్డినెన్స్ రావడానికి కృషి చేసిన రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్యకు, డైరెక్ట ర్లకు, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్య క్రమంలో జి.నారాయణ, పి.అశోక్‌రాం, చీరాల పేరాల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మాచవరపు వెంకటేశ్వర్లు, కె.సుబ్బారావు, ఆతిన బోసుబాబు, వి.వెంకటస్వామి, వి.మల్లికార్జునరావు, వి.శ్రీనివాసరావు, వేటపాలెం నాయకులు అజయ్ బాబు, మాచవరపు శ్రీను, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నృసింహుని సన్నిధిలో ‘ఆక్టోపస్’ రెక్కీ



ఆలయంలో వీడియో రికార్డింగ్ ద్వారా టెక్నికల్ రెక్కీని నిర్వహిస్తున్న ఆక్టోపస్ అధికారులు

మంగళగిరి: దేవస్థానాల భద్రతకు సంబంధించి సరికొత్త టెక్నాలజీని ఆవిష్కరించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థా నంలో ఆక్టోపస్ టీమ్ సభ్యులు మంగళవారం టెక్ని కల్ రెక్కీ నిర్వహించారు. ఫార్డ్ త్రీడీ లేజర్ స్కానర్ అనే అత్యాధునిక పరికరం ద్వారా ఆక్టోపస్ సిబ్బం ది టెక్నికల్ రెక్కీ నిర్వహించి 360 డిగ్రీల కోణంలో దేవస్థాన వ్యూను పూర్తిస్థాయిలో రికార్డింగ్ చేశారు. భవిష్యత్తులో దేవస్థానాల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింద ని, ఏ విధమైన అపాయం కలిగినా సమగ్రంగా ఎదుర్కొనే అవకాశం ఉందని ఆక్టోపస్ అధికారులు తెలిపారు. అడిషనల్ డీజీపీ ఆపరేషన్స్ ఆర్‌కే మీనా, ఆక్టోపస్ డీఐజీ ఎస్‌వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నృసింహస్వామి దేవస్థానంలో తొలిసారి రెక్కీని నిర్వహించినట్లు చెప్పారు.

లాభసాటి వ్యవసాయమే ధ్యేయం

వ్యవసాయ, సహకారశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది



నంబూరు ఆర్బీకేలో కియోస్క్ ద్వారా సేవలను పరిశీలిస్తున్న గోపాలకృష్ణ ద్వివేది

పెదకాకాని: లాభసాటి వ్యవసాయమే ధ్యేయం గా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర వ్యవ సాయ, సహకారశాఖ ప్రత్యేక ప్రధాన కార్య దర్శి, రైతు భరోసా కేం ద్రాల ముఖ్య కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మం డలం నంబూరు రైతు భరోసా కేంద్రం, పాలసేకరణ కేంద్రాన్ని గోపాలకృష్ణ ద్వివే ది, వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వే ణుగోపాలరెడ్డి మంగళవారం సందర్శించారు. సమీకృత రైతు సమాచార కేంద్రం, ధాన్యం తేమశాతం గుర్తించే పరికరం, కియోస్క్ యంత్రం పనితీరు పరిశీలించారు. రబీ క్రాప్ బుకింగ్ వివరాలు, పొలంబడి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సం దర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ పురుగు మందులు, విత్తనాల కంపెనీలతో మాట్లాడి ధరలు తగ్గించేం దుకు కృషి చేస్తానన్నారు. అలానే వ్యవసాయ యంత్ర సేవా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. పాడి రైతులు అమూల్ డెయిరీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీసీ రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్

సంఘం జాతీయ యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్



యద్లపాడు సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

యద్లపాడు: బీసీ రిజర్వేషన్ పితామహుడు బిందేశ్వర ప్రసాద్ మండల్ కాంస్య విగ్రహ ఆవిష్కరణను బీసీ సంఘాలన్నీ దిగ్విజయం చేయాలని సంఘం జాతీయ యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, విగ్రహ నిర్మాణ కమిటీ కో–కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు కోరారు. పల్నాడు జిల్లా యద్లపాడులో బీసీ సంఘాల నాయకులతో మంగళవారం సమావేశం అయ్యారు. బీసీ సంఘ జిల్లా నాయకులు రాచమంటి చింతారావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో వారు ప్రసంగించారు. మండల్ –2 ఉద్యమ నిర్మితంలో భాగంగా దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా బీపీ మండల్ విగ్రహాన్ని గుంటూరు నగరంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 12వ తేదీన గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్డు అమరావతి జంక్షన్ వద్ద జరిగే ఈ కార్యక్రమానికి యూపీ మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్, కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య, బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, ద్రావిడ కళగం అధ్యక్షుడు కె.వీరమణి, తమిళనాడు సీఎం స్టాలిన్ సోదరి, ఎంపీ కనిమొళి, ఎంపీలు మనోజ్‌కుమార్ ఝా, పి.విల్సన్, తిరుమావళవన్, తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, బిహార్, యూపీ, హర్యానా మాజీమంత్రులు శ్యాంరజక్, శివపాల్‌సింగ్, కెప్టెన్ అజయ్ సింగ్, తెలంగాణ, బిహార్ ఎమ్మెల్యేలు నోముల భగత్, వి.కృష్ణారావు, బీపీ మండల్ మునిమనవడు ఆచార్య సూరజ్‌మండల్ హాజరై బీసీలకు మండల చేకూర్చిన మేలు, మండల్ –2 దిశ నిర్దేశాలను వివరిస్తారన్నారు. ఈ విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్‌గా ఎమ్మెల్సీ జంగా కృష్ణామూర్తి బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మంత్రి రజినికి ఆహ్వానం..

బీపీ మండల్ కాంస్య విగ్రహావిష్కరణకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినిని బీసీ సంఘాల నాయకులు ఆహ్వానించారు. బీపీ మండల్ విగ్రహ నిర్మాణ కమిటీ కో–కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్ నేతృత్వంలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. సమావేశంలో బీసీ నాయకులు శివకుమార్, కేశవ, ఉప్పాలభాస్కర్, కీర్తి అరుణ్ కుమార్ యలమంద పేరిబాబు తదితరులు ఉన్నారు.

లాభసాటి పంటలపై రైతులు దృష్టి పెట్టాలి

- ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి
- పల్నాడులో పండ్ల తోటల సాగు సంతోషకరం



డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న నాగిరెడ్డి, అధికారులు, తదితరులు

మాచవరం: తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే లాభసాటి పంటలపై రైతులు దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో గ్రామానికి చెందిన కురేల వెంకటేశ్వర్లు 12 ఎకరాల్లో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంట పొలాన్ని మంగళవారం సందర్శించారు. ముందుగా గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో, వ్యవసాయ శాఖ సిబ్బందితో మాట్లాడారు. ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు తమ పరిధిలో సాగు చేసే పంటల వివరాలను తెలియజేశారు. రైతులు మాట్లాడుతూ ఆకురాజుపల్లి మేజర్ పరిధిలో చివర భూములకు సాగునీరు సక్రమంగా అందడం లేదని, భూగర్భ జలాలు పడిపోయి బోర్లు ఎండిపోతున్నాయని, చుక్కల భూములు, ప్రభుత్వ భూములు సాగు చేసుకునే రైతుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ చైర్మన్ నాగిరెడ్డి మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి సాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని, పంట అమ్మకాల సమయంలో కంప్యూటర్ కాటాల మోసాలపై అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఆర్‌బీకేల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలించి, రైతు అనుభవాలను, సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని హార్టీకల్చర్ హబ్‌గా మార్చాలన్నదే వ్యవసాయ శాఖ లక్ష్యమన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కోనసీమ, రాయలసీమ ప్రాంతాలు పండ్ల తోటల పెంపకానికి ప్రత్యేకంగా నిలిచాయని, మెట్ట ప్రాంతమైన పల్నాడులో పండ్ల తోటలు, ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపడం సంతోషకరమన్నారు. ఇలాంటి రైతులను ఆదర్శంగా తీసుకొని పండ్ల తోటలు, కూరగాయ పంటలు, చిరుధాన్యాలు పంటల సాగుపై రైతులు మరింత ఆసక్తి చూపాలని కోరారు. రైతుల అనుభవాలను, పంటలకు అనువైన వాతావరణ వివరాలు, సాగునీటి వసతులు తెలుసుకొని ఇతర ప్రాంతాల రైతులకు వివరించేందుకు పర్యటన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వానికి వివరించేందుకు తాము వారధిగా పరిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మండలంలోని శ్రీరుక్మిణీపురంలో సాగు చేస్తున్న వరిగ పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీహెచ్‌ఓ బెన్ని, హెచ్‌ఓ శ్రీనివాసరావు, ఏఓ రామమ్మ, స్థానిక సర్పంచ్ దొండేటి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి, కన్వీనర్ సింగరయ్య, స్థానిక నాయకులు, ఆదిరెడ్డి, కనకారెడ్డి, రోశయ్య, గురవారెడ్డి, సిబ్బంది వంశీ, అన్వర్, ప్రబాకర్‌రెడ్డి, నర్సయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఈ-ఫార్మసీకి వ్యతిరేకంగా 15 నుంచి ఔషధ వ్యాపారుల ఆందోళన

గుంటూరు మెడికల్: ఈ–ఫార్మసీతో ప్రజారోగ్యం దెబ్బతింటుందని, కేంద్రం ఈ–ఫార్మసీని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆల్ ఇండియా జాయింట్ సెక్రటరీ కే.పి.రంగారావు అన్నారు. మంగళవారం గుంటూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ–ఫార్మసీకి వ్యతిరేకంగా ఫిబ్రవరి 15 నుంచి దేశవ్యాప్తంగా అన్ని మండలాలు, జిల్లాలు, రాష్ట్ర రాజధానుల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఔషధాల షాపులు మూసివేసి తమ నిరసన, ఆందోళన తెలియజేస్తామన్నారు. ఈ–ఫార్మసీ నిర్వాహకులు చట్టాలను ఉల్లంఘిస్తూ..ప్రజారోగ్యాన్ని తుంగలో తొక్కుతున్నారన్నారు. పౌరులకు ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా కార్పొరేట్ సంస్థలు ఆన్‌లైన్‌లో మందులు విక్రయిస్తున్నాయని చెప్పారు. నార్కొటిక్స్, సైకోట్రిపిక్, మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సి పిల్స్ మందులను వైద్యుల సలహాలు లేకుండా ఆన్‌లైన్‌లో విక్రయించడం ద్వారా ప్రజలు కొంత మంది మత్తు మందులకు బానిసలవుతారన్నారు. ఈ ఫార్మసీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

చినగంజాం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్సీ టీ కల్పలతా రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం చినగంజాం మండలంలోని చినగంజాం, పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటు ఇంకొల్లు మండలం జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ మేనిఫెస్టో తయారు చేసుకొని ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. సర్వీసు రూల్స్ మీద ప్రధానంగా దృష్టి పెట్టామని, ఎంఈవోల ప్రమోషన్‌లపై ప్రత్యేకంగా కృషి చేశామని పేర్కొన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాలతోపాటు రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లో పాఠశాలలో కూడా పర్యటించి పాఠశాలలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తను కేవలం పదవీ కోసం ఎమ్మెల్సీ కాలేదని పాఠశాలలు, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించి సేవ చేయాలన్న ధ్యేయంతోనే ఉన్నట్లు స్పష్టం చేశారు. నెల్లూరు, రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర నాయకులు కే జాలిరెడ్డి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు బొజ్జా సురేష్, ప్రధాన కార్యదర్శి దండమూడి శాంతారావు, ప్రకాశం జిల్లా నాయకులు జీ వెంకటేశ్వర రెడ్డి, పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇన్‌చార్జ్ వి హరికృష్ణ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీహెచ్ శిరీష, ప్రసాద్‌రెడ్డి, చినగంజాం, పెదగంజాం పాఠశాలల హెచ్‌ఎం డీ రత్నకుమారి, ఎం దేవదత్తం తదితరులు పాల్గొన్నారు.

98 డీఎస్సీ అభ్యర్థులందరికీ ఉద్యోగాలు గ్యారంటీ

98 డీఎస్సీ అభ్యర్థులందరికీ ఉద్యోగాలు సాధించి పెట్టాలన్న ధ్యేయంతో ఇప్పటి వరకు తీవ్రంగా కృషి చేశామని, సీఎం దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లి అభ్యర్థుల వెబ్ నమోదు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ వంటి చర్యలు చేపట్టామని కల్పలతారెడ్డి అన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకు రావడంతోపాటు కేబినెట్ సమావేశం అనంతరం రెండు మూడు రోజుల్లో జీఓను సైతం విడుదల చేయనున్నట్లు ఆమె తెలిపారు.

అధికారులు పనితీరు మార్చుకోవాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్లఅర్బన్: గ్రామాల్లో ఇళ్ల మధ్య, రహదారుల వెంట చెత్తకుప్పలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో మంగళవారం స్పందన సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారుల చెత్త సంపద కేంద్రాలు అధ్వానంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీ విధానంపై అధికారులకు అవగాహన లేకపోవడం ఏమిటని నిలదీశారు. గ్రామాలలో చెత్త కుప్ప నిల్వలు పెరిగిపోతున్నాయన్నారు. కొల్లూరు, భట్టిప్రోలు, కర్లపాలెం, వేమూరు, అద్దంకి మండలాలలో చెత్త సంపద కేంద్రాల నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. ఆయా మండలాల అధికారుల పనితీరు మార్చుకోవాలని సూచించారు. ప్రధాన రహదారుల వెంట చెత్త కనిపిస్తే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి శనివారం పారిశుద్ధ్య కార్యక్రమాలు విధిగా నిర్వహించాలని ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం అభివృద్ధి పనులు నేటికీ ప్రారంభించకపోవడంపై సంబంధిత అధికారులను నిలదీశారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలన్నారు. బాపట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలో 68 పనులు మొదలు కాలేదన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు గడువులోగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రాధాన్యతక్రమంలో పనులు పూర్తిచేయాలని, నేటికి మొదలుకాని పనులను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను తక్షణమే ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం గడువులోగా పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కొరిశపాడు, కారంచేడు మండలాల్లో సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు 81.94 శాతం ఉండడంపై నిలదీశారు. ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియకోసం పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఆధార్ శిబిరాలు తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. జగనన్న కాలనీలలోని పక్కా గృహ నిర్మాణాలు పురో గతి కనిపించాలన్నారు. బాపట్లలో అక్రమ లే-అవుట్లను అధికారులు తక్షణమే తొలగించాలన్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల జెడ్పీ సీఈవోలు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం యువత మాదక ద్రవ్యాలకు పాల్పడటం వలన కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ ప్రధాన కూడలి ప్రాంతాల్లో పోస్టర్లు ఏర్పాటుచేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ యువతరాన్ని చెడు మార్గాల్లో నడిపిస్తున్న దుర అలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైనదన్నారు. మాదక ద్రవ్యాలను వినియోగించిన, విక్రయించినా, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. దానిలో భాగంగా జిల్లా పోలీస్ అధికారులు 'యువత మేలుకో – భవితను మలచుకో – డ్రగ్స్ వదులుకో' అంటూ జిల్లాలోని వివిధ కళాశాలలు, పాఠశాలల్లో మాదక ద్రవ్యాలకు విద్యార్థులు ఎలా దూరంగా ఉండాలో సూచనలు ఇస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా' అనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాలు మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగిస్తాయని, వీటిని వాడకం ఒక ప్రమాదమైన వ్యసనమన్నారు. కళాశాలల్లోని విద్యార్థులు కొందరి స్నేహితుల ప్రభావం వల్ల, స్నేహితులను పరిచయం చేసుకోవాలనే ఉద్దేశంతో, డ్రగ్స్ ఎలా ఉంటాయో తెలుసుకోవాలనే ఉద్దేశంతో డ్రగ్స్ తీసుకోవడం ప్రారంభిస్తున్నారన్నారు. మాదక ద్రవ్యాలను వినియోగించిన, కలిగివున్న విక్రయించిన, రవాణా చేసిన 10 నుంచి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించబడుతుందన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

డీపీవో శంకర్‌నాయక్



స్వర్ణలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను పరిశీలిస్తున్న డీపీవో శంకర్‌నాయక్

కారంచేడు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను కేటాయించిన కొలత ప్రకారం నిబద్ధతతో నిర్వహించాలని డీపీవో శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని స్వర్ణ గ్రామ పంచాయతీ పరిధిలో స్వర్ణ–చీరాల రోడ్డులోని పనులను పర్యవేక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, అన్నదాతలకు అనువైన తీరులో పనుల నిర్మాణం చేపట్టాలన్నారు. వారికి అవసరమైన విధంగా లింక్‌రోడ్లు, పంట కాలువల నిర్మాణంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. రోజువారీ వేతనంగా రూ.257లకు తగ్గకుండా ఉండేలా పనులను చేసుకోవాలన్నారు. మొదట మండల కేంద్రం కారంచేడులోని చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగైన పనుల విషయమై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, ఎంపీడీవో రమేష్‌బాబు, ఏపీవో ప్రదీప్‌కుమార్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, రైతులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

చేపల వేటను నిషేధిస్తూ 145 సెక్షన్ అమలు



పోతార్లంక వద్ద నదిలో హద్దులు పరిశీలిస్తున్న పోలీసు, మత్స్యశాఖ అధికారులు

కొల్లూరు: మత్స్యకారులు చేపల వేటకు వినియోగిస్తున్న వలల విషయంలో చోటుచేసుకుంటున్న వివాదాల నేపథ్యంలో చేపల వేటను తాత్కాలికంగా నిషేధిస్తూ పోలీసు, మత్స్యశాఖాధికారులు నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం కొల్లూరు పోలీసుస్టేషన్‌లో మండలంలోని గాజుల్లంక, పోతార్లంక గ్రామాలకు చెందిన మత్స్యకారులతో రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, వేమూరు సీఐ వెంకటేశ్వరరావులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇరు గ్రామాలకు చెందిన మత్స్యకారుల మధ్య చేపల వేటకు సంబంధించిన వలల విషయంలో రాజీ కుదిర్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీనితో అధికారులు చేపల వేట విషయంలో చోటుచేసుకుంటున్న వివాదాన్ని సద్దుమణిచేందుకు 145వ సెక్షన్ అమలు చేస్తున్నామని ప్రకటించారు. పోతార్లంక పంచాయతీ పరిధిలోని కృష్ణా నదీ జలాల్లో 145 సెక్షన్ అమలులో ఉన్నన్ని రోజులు ఇరు గ్రామాలకు చెందిన మత్స్యకారులు చేపల వేట చేపట్టరాదన్నారు. ఇరు గ్రామాల మత్స్యకారులు చేపల వేట చేపట్టకుండా పోలీసు, మత్స్యశాఖ సిబ్బందిని పహారా ఏర్పాటు చేయనున్నామని, నిబంధనలను అతిక్రమించి ఎవ్వరు చేపల వేట సాగించినా చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కొల్లూరు ఎస్‌ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్, మత్స్యశాఖ కూచిపూడి డీఓ జె.హిమజ నదిలో వేటాడకుండా నిర్దేశించిన హద్దులను నిర్ణయించి వేటను నిషేధిస్తున్నట్లు ప్రకటించారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



అద్దంకిలో విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్



ర్యాంక్ సాధించిన అక్షయ కార్తీక్

అద్దంకి రూరల్: జేఈఈ మెయిన్ 2023 మంగళవారం వెలువడిన ఫలితాల్లో అద్దంకి మండలంలోని చినకొత్తపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి బుర్రా పూర్ణ చంద్రరావు 96.99 శాతం మార్కులు సాధించాడు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు అభినందిచారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన ద్రోణాదుల విద్యార్థి

మార్టూరు: జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో ద్రోణాదుల గ్రామానికి చెందిన రేపూడి అక్షయ్ కార్తీక్ తన ప్రతిభ చాటాడు. 99.71 శాతం పర్సంటేజ్ సాధించిన అక్షయ కార్తీక్ జూన్ 4వతేదీ నిర్వహించనున్న జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో మెరుగైన ర్యాంక్ సాధించి ముంబయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవాలనేది తన ధ్యేయంగా తెలిపాడు. అక్షయ్‌కార్తీక్ తండ్రి శ్రీనివాసరావు యద్దనపూడి మండలం పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చీరాలరూరల్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చీరాలలో వెలుగుచూసింది. జీఆర్పీ ఎస్సై సీహెచ్.కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. చీరాల రామకృష్ణాపురానికి చెందిన చొప్పర బాలకృష్ణ (40) చెవుడు, మూగతో బాధపడుతున్నాడు. అతడు సోమవారం రాత్రి సమయంలో వైకుంఠపురం రైలు గేటు వద్ద విజయవాడ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను గమనించకుండా పట్టాలు దాటుతున్నాడు. వేగంగా వచ్చిన ఎక్స్‌ప్రెస్ బాలకృష్ణను ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై కొండయ్య స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

పరుగుల వీరుడు పంబాకు పతకాలు

- మాస్టర్స్ అథ్లెటిక్స్, ట్రిపుల్ జంప్‌లో బంగారు పతకం
- అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు ఎంపిక
- సాయం కోసం ఎదురుచూపు



రన్నర్ నాగయ్య

చీరాల రూరల్: 70 ఏళ్ల వయస్సులో మనుమళ్లు, మనమరాళ్లతో ఆటలాడుకునే వయస్సులో ఏ మాత్రం తడబడకుండా కూడా తనలో సత్తువ తగ్గలేదని నిరూపించి జాతీయ స్థాయిలో నిర్వహించిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 800 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం, ట్రిపుల్ జంప్‌లో బంగారు పతకం సాధించి చీరాలకు వన్నె తెచ్చాడు. అతడే పరుగుల వీరుడు పంబా నాగయ్య. ఈనెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ ఒలింపిక్స్ అసోసియేషన్ అండ్ స్పోర్ట్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో 5వ ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ చాంపియన్స్ షిప్–2023 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చీరాలలోని పేరాల ఆనంద పేటకు చెందిన పంబా నాగయ్య 70 ఏళ్ల ప్లస్ వయస్సు విభాగంలో పరుగుల పోటీల్లో పాల్గొన్నాడు. అతని ప్రతిభను గుర్తించిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోషియేషన్స్ నిర్వాహకులు నాగయ్యను ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేశారు. మార్చిలో దక్షిణ కొరియాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్లు నాగయ్య ఎంతో ఆనందంతో చెప్పాడు. ఇప్పటికే అతడు 12 సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. 2006లో కూడా అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై విదేశాలకు వెళ్లలేక ఆర్థిక స్థోమత సరిపోక నానా ఇబ్బందులు పడ్డాడు. నాగయ్యను స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అభినందించారు.

ఏఎన్‌యూలో మార్కుల టాంపరింగ్‌పై విచారణ

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మార్కుల టాంపరింగ్‌పై పోలీసు విచారణ కొనసాగుతుంది. ఏఎన్‌యూలో బీటెక్ విద్యార్థుల పరీక్షల మార్కులు టాంపరింగ్ జరిగిందని, విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని 15 రోజుల కిందట వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కరుణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమ, మంగళవారాలలో లాం గ్రామ సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 35 మంది బీటెక్ విద్యార్థులను విచారణ చేపట్టారు. ఈ విచారణలో వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే కొంతమంది విద్యార్థులు పరీక్షల్లో తాము ఫెయిల్‌గా భావించి వక్రమార్గంలో ఉత్తీర్ణులయ్యేందుకు ప్రయత్నాలు చేసినట్లు నిర్ధారణ అయింది. పరీక్షా పత్రాల వాల్యుయేషన్ సెంటర్‌లో కొందరు కిందిస్థాయి సిబ్బందిని ఆశ్రయించి పెద్ద మొత్తంలో నగదు ముట్టజెప్పినట్లు ఒప్పుకున్నారని సమాచారం.